# నా వాణి

-'వాణి'

కాలం కలిసి రావాలి!

కార్యం జరిగిపోవాలి!!

మనం కోరే కోరికలన్నీ తీరవు. తీరే కోరికలలో మనం కోరుకునేది ఉండాలనుకుంటాము. తీరితే ఆనందం. లేదంటే విషాదం!!

కథంటే — కావలసిన చోట ఆనందం అతికించొచ్చు. వద్దనుకుంటే విషాదం తీసెయ్యొచ్చు. కానీ, జీవితం అలా కాదే. నా జీవితమంతా విషాదంగానే గడిచిపోతుంది. విషాదానికి కారణం తెలీదు. నువు లేవన్న బాధ తప్ప. రోజులన్నీ మనకు అనుకూలంగా ఉండవు. కష్టించి, కాలాన్ని ఎదిరించి బ్రతుకు కొనసాగిస్తే

అతడు మహాత్ముడు

కాదంటే మూర్ఖుడు

ఈ విషయాలు మనకు వర్తించవు. ఎందుకంటే, మనం ప్రేమికులం. మనకు కాలాన్ని ఎదిరించడాలూ, కొండను ఢీకొనడాలూ లాంటివి ఉండవు. అవసరమయితే ప్రకృతినే మనకు అనుకూలంగా మార్చుకోగలం. ప్రేమకు గల శక్తి అదే మరి.

అసలు ప్రేమంటే ఏంటో తెలుసా? "నీకు పదిమందితో కలిసే అవకాశం ఉండి అందులో ఒకరే నచ్చితే అది ప్రేమ!

చూసిన మొదటి పదిసార్లవరకూ ప్రేమలో పడకపోవడం ప్రేమ!! ఇది మనకు అక్షరాలా సరిపోయే విషయం.

'ఆనందం, అనురాగం, ఆప్యాయత, అనుబంధం ఏర్పడటానికి ఏళ్ళ తరబడి పరిచయం అక్కరలేదు. కల్లా కపటంలేని కాస్త సంభాషణ చాలు' ఆ రోజు నువ్వన్న మాటలు నా గుండెల్లో ధ్వనిస్తున్నాయి. అసలు నిన్ను చూడగానే నాకేమనిపించిందో తెలుసా? "ప్రేమల్లో, ముఖ్యంగా ప్రేమికుల్లో పూర్వజన్మ సుకృతాలు బలంగా పనిచేస్తాయి. లేకపోతే, రోజుకు ఇన్ని వందల, వేల మొహాలు చూసే మనకు ఎవరో దగ్గిర వాళ్ళనిపిస్తుంది అని. అందుకే నీతో పరిచయం పెంచుకున్నా, అది పరిచయం నుంచి ప్రేమగా మారి, అనుబంధం, ఆప్యాయత, అనురాగం లాంటి మాటలను దాటి చివరికి విషాదానికి దారి చూపిస్తుందనుకోలేదు.

తెలిసి కొందరు తప్పుచేస్తారు.

తెలియక ఇంకొందరు తప్పుచేస్తారు.

తెలిసీ, తెలియక మరికొందరు తప్పుచేస్తారు. ఇందులో నేను ఏ కోవకు చెందానో నిర్ణయించాల్సింది నీవే. అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది 'అసలు నేను తప్పు చేశానా?' అని.

నువు పరిచయం అయిన తరువాత నాకెంత ఆనందంగా ఉన్నదో! ఎందుకో నాకే అర్థం కాదు రోజుల తరబడి ఆలోచించా ఆ విషయమే. సమాధానం దొరకని ప్రశ్న. అవును మరి, కొన్నింటికి ప్రశ్నలు మాత్రమే ఉంటాయి. సమాధానాలు ఉండవు.

అలాంటి వాటిలో ఇది మొదటిదేమో!!

నీ గురించి నాకు తెలిసిన వారందరికీ చెబుదామనుకున్నా. ఈ ప్రపంచంలో 'నా' అనే వాళ్ళు నాకెవరూ లేరు.

ఎంగీ, వేలా — నా తల్లిదండ్రులు,

చెట్లూ, చేమలూ — నా అక్కా బావలు,

ఆకులూ, అలములూ — నా అన్నదమ్ములు,

పండ్లూ, కాయలూ — నా మిత్రులు,

చిగుళ్ళు, చిన్నిపిందెలు — నా చెల్లెళ్లు!

వసంత ఋతువులో తీయగా పాడటానికి వచ్చే కోయిలే నా దూరపు చుట్టం. మాటలు రాని నా 'ఊ' ప్రపంచానికి నేనెలా నా విషయం తెలియజే



యాంవే పిచ్చి ఆలోచన నాకెందుకొచ్చిందో, అసలు వాటికి తెలియకుండా మనమెలా బ్రతకగలం

"దూరంగా ఉంటే చేరువ కావాలనిపిస్తుంది. చేరువైతే తాకాలనిపిస్తుంది. తాకితే సుఖం కావాలనిపిస్తుందట' ఇది నాకు మాత్రం వర్తించదు. ఎందుకంటే, నిన్ను చూడాలనే కోరిక, నీతో మాట్లాడాలనే అభిలాష తప్ప నాకు మరే కోరికా లేదు.

"ఒక సాయంకాలం నుంచి మరొక సాయంకాలానికి చేరాలంటే చీకటి వాకిలి తలుపులు తెరచి ఒక రాత్రినీ, ఒక ఉదయాన్నీ దాటాలట. ఒక కోయిలపాట వినడానికి ఐదు ఋతువులు వేచి చూడాలట. నిజమయిన ఒక ప్రేమని నెగ్గాలంటే ఎన్ని పరీక్షలో!"

నువు నమ్మలేని విషయం చెప్పనా! మొన్నటి వరకూ నాకు ప్రేమంటేనే తెలీదు. నువు పరిచయమయిన తరువాత నాకు ఎక్కువగా తెలిసింది ఆ ప్రేమ గురించే. ఈ ప్రపంచంలో నేను అనుభవించింది చాలా తక్కువ. అనుభవించాల్సింది చాలా ఎక్కువ. ఎందుకంటే, నాకు ఇప్పుడు ఇరవై సంవత్సరాలకంటే తక్కువ. కానీ, జీవితమే విరక్తిగా సాగుతుంది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నిద్ర రాదు. ఆకలిరాదు. నీ దగ్గరే ఉండాలని అనిపిస్తుంటుంది. నీతోనే మాట్లాడాలనిపిస్తుంది. నువు కాదంటే నేను బ్రతకలేను" లాంటి మాటలు చెప్పడం నాకు చేతకాదు. కానీ, ఒకటి మాత్రం నిజం నువ్వు లేవన్న కొరత నన్ను పిచ్చివాణ్ణి చేస్తుంది. కొన్ని విషయాలు తెలుసుకుంటే మంచిది. నీ గురించి వచ్చే ఆలోచనలే మానివేద్దామనుకుంటాను. సాధ్యంకాదు. మొండి మనసు నిన్నే కలవరిస్తుంది. పదే పదే గుర్తు చేసుకుంటుంది. నువ్వంటే నాకెందుకింత పిచ్చి ప్రేమో, నాకిప్పటికీ — అసలెప్పటికీ అర్థం కాదేమో. అభిమానం మాత్రం అలాగే ఉండిపోతుంది.

నువ్వంటే నాకెందుకింత ఇష్టమో చెబితే నమ్మవేమో! అవును మరి మనం ఒకరిని అభిమానిస్తున్నాం అంటే వారికి ఏదో ఒక ప్రత్యేకమయిన గుణం ఉండి అది మనల్ని ఆకర్షిస్తుంది. నీకంటూ కొత్తగా వచ్చిన గుణం ఏమీ లేదు. నీ చిన్న పిల్లల చేష్టలు తప్ప. చిన్నపిల్లలంటే నీ కెంతిష్టమో, నాకూ అంతే ఇష్టం. నీలో నాకు నచ్చినగుణం అదే. అదే నన్ను నీకు పరిచయం చేసింది. అసలు మన పరిచయమే విచిత్రంగా ఒక 'పవిత్ర'మయిన స్థలంలో జరిగింది కదూ. గత కాలం అనాభావాలు గుండెల్లో నిలువలేక ఎగదోసుకువస్తున్నాయి.

విషాదమయితే — కన్నీళ్లుగా!

ఆనందమయితే — ఆహ్లాదంగా!!

"నీ హృదయ రహస్యాన్ని నువ్వు నీలోనే దాచుకోనవసరం లేదు నేస్తం. దానిని నాతో పంచుకో. ఎందుకంటే దానిని నా చెవికాదు. నా హృదయం వింటుంది" అనే 'నా' స్నేహితుల భావాలకు ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక బాధ పడటమే నావంతు. తమ బాధను గానీ, సంతోషాన్ని గానీ ఇతరులతో పంచుకుంటే మంచిదంటారు. నాకు అలాంటివేం ఇవ్వలేదు దేవుడు. అందుకే నేనతన్ని నమ్మను. నా కసలు అలాంటివి ఇష్టం ఉండదు. నా రహస్యాలు నాలోనే గుప్తంగా దాచుకోగల విగ్రహం నాకుంది. ఆనందమయినా, విషాదమయినా ఒకటే నాకు. అసలు నాకు ఆనందం ఉంటే కదా ఎప్పుడూ విషాదం తప్ప. ఓ విషయం మాత్రం గుర్తుంచుకో "ఇవ్వడంతో ఆగిపోయినప్పుడు అది ప్రేమ అవుతుంది. తిరిగి తీసుకోవడం మొదలు పెట్టినప్పుడు అది స్వార్థం అవుతుంది" ఇంతవరకూ నేను నీకు ఇవ్వడం

తప్పితే నీ నుంచి ఏం ఆశించలేదు. కానీ, నీ విషయంలో మాత్రం కొంచెం తప్పటడుగు వేస్తున్నా. నాకు నీ హృదయంలో కాస్త చోటివ్వు. గుండెలలో నిలిచిన మనిషి గుడిలోని దేవుళ్ల కంటే పవిత్రమయిన వ్యక్తి. ఇది స్వార్థమంటే నేనొప్పుకోను.

దుఃఖం ఉన్నచోట ప్రేమ ఉంటుంది. ప్రేమ ఉన్నచోట ఖచ్చితంగా దుఃఖం ఉంటుంది. శరీరాలు కలిస్తే ఆ ప్రేమ అశాశ్వతం అనీ, మనసులు కలిస్తే ఆ ప్రేమ శాశ్వతం అనీ నా నమ్మకం. మనకు మనసులు మాత్రమే కలిశాయి. కాబట్టి మనది శాశ్వతమయిన ప్రేమకదూ!

నీకు నేనసలు గుర్తుంటానా? ఏమో... ప్రతి మనిషి తన జీవితంలో జరిగే మొదటి మంచి సంఘటననుగానీ, చెడు సంఘటనను గానీ తన జీవిత కాలమంతా గుర్తుంచుకుంటారట. నువ్వు కూడా నాలాగే కథలు రాస్తుండొచ్చు. కవితలు రాస్తుండొచ్చు. కానీ, నేనెక్కడున్నానో నీకు తెలీదు. నువ్వెక్కడున్నావో నాకూ తెలీదు. ఏం చేస్తున్నావో తెలీదు. ఎలా వున్నావో తెలీదు. నీ గురించి నాకు ఏమీ తెలియకపోయినా నేను కోరుకునేది "ఈ ప్రపంచంలో నువ్వెక్కడున్నా క్షేమంగా ఉండాలని మాత్రమే".

నిన్ను మొట్టమొదటిసారి చూశాను. తల తిప్పుకోలేకపోయాను. "రంభ, ఊర్వశి, మేనకల ను తలదన్నే అందం నీలో ఉందని" చెప్పనుగానీ, రెండవసారి చూస్తే...

తప్పు లేదనిపించింది.

చూశాను.

నిదానంగా తెలిసింది.

ఆ చూపుల అర్థం ప్రేమని,

నువ్వంటే నాకు లవ్వని,

అప్పట్నుంచీ వెతుకుతూనే ఉన్నా నీ కోసం!

కొండల వెనుక నేను పారేసుకున్న జ్ఞాపకాల మూటల్ని భుజాన పెట్టుకుని ప్రతిరాత్రి నన్ను బాధ పెట్టడానికి చంద్రుడొస్తాడు. గుర్తు చేసుకుంటున్నప్పుడల్లా గుండెల్లో బాధ.

"మరచిపోలేని మధురానుభూతులు కొన్నయితే . చెరిగిపోని చేదు అనుభవాలు మరికొన్ని" ఇది నాకు మధురమైన అనుభూతో, చేదు అనుభవమో నాకే అర్థం కాని పరిస్థితి ప్రస్తుతం నా స్థితి. కాల చక్రంలో దొర్లిపోతున్న

ప్రతి పనికీ — కాలం సాక్ష్యం చెప్పదు.

గడియారం గుండె విప్పదు.

"ప్రతి మనిషి జీవితంలో కొన్నే మధుర ఘడియలుంటాయి. మిగిలిన జీవితమంతా వాటికి ఉపోద్ఘాతమూ, పర్వతీ మాత్రమే నట". ఇది నాకు మధుర ఘడియ అయితే ఉపోద్ఘాతమూ, స్మృతీ ఉంటాయి. చెడుదయినా కానీ అవే ఉంటాయి. కాకపోతే రెంటికీ కాస్త మాత్రమే తేడా ఒకదానికి ఆనందం, మరొకదానికి దుఃఖం గుర్తులుగా మిగులుతాయి.

"బాధ పడకు నేస్తం. నిద్రపోక, మనసాగక ఎవరికోసం ఎదురుచూపు? మనకు కావలసిన వారి (వ్యక్తుల) కోసం ఎదురుచూడాలి. మనకోసం ఎదురుచూసే వారి కోసం మనం ఎదురుచూడాలి. మనకోసం బ్రతికే వారి కోసం మనం బ్రతకాలి" అనే పిల్ల తెమ్మెరతో నా ప్రేమ 'బాధ' ఎలా చెప్పాలో అర్థం కాదు.

'జీవితాని'కి అర్థం మనం జీవిస్తేనే తెలుస్తుంది.

'మరణాని'కి అర్థం మనదగ్గిర వాళ్ళు మరణిస్తే నే తెలుస్తుంది.

'ప్రేమ'కి అర్థం మనం ప్రేమిస్తేనే తెలుస్తుంది . నువ్వు ప్రేమించావా? ప్రేమించకపోతే నీకు తెలీదు నేస్తం నా హృదయ ఆవేదన' అని చెప్పాలనుకుంటాను. కానీ చెప్పలేను. నువు చూసిన చూపే నా గుండెల్లో గుచ్చుకుంది. అది రోజుకొక్కసారయినా నన్ను బాధపెడ్తుంది.

'దేవదాసు — పార్వతి, సలీం — అనార్కలీ, లైలా — మజ్నూ'ల ప్రేమకంటే నా ప్రేమ గొప్పదనీ నువ్వూ వారిలాగా, నాలాగా జీవితం విరక్తిగా సాగదీయొద్దని నా మనవి. ఎందుకంటే 'నీ క్షేమమే నా అభిలాష'.

ముందే చెప్పినట్టుగా... కాలం కలిసి రావాలి!

కార్యం జరిగిపోవాలి!!

విధిరాతను మనం మార్చలేం. 'కాలం' కలిసొచ్చి మనిద్దరం కలిస్తే ఆనందంగా

"కలువలు కౌగిలించుకుంటున్నాయి,

మల్లెలు ముద్దాడు కుంటున్నాయి,

సంపెంగలు చుంబించు కుంటున్నాయి" అను కుందాం.

లేదంటే —

నువ్వు కాదంటే — కన్నీళ్లు!!

మరుజన్మ, అనేదే ఉంటే నువ్వూ, నేనూ దగ్గరవుదాం. అపుడు సంవత్సరాల తరబడి మాట్లాడుకుందాం. ఆడుకుందాం. పాడుకుంటా ం. అప్పుడ మనల్ని ఎవరూ విడదీయలేరు. ఎందుకంటే మనం ప్రేమికులం. ప్రేమికులకు కాలాన్ని ఎదిరించడాలూ, కొండని ఢీకొనడాలూ ఉండవు. అవసరమయితే ప్రకృతినే మనకు అనుకూలంగా మార్చుకోగలం.

"ఓ మధుర స్మృతిని మరచిపోవాలంటే ఓ జీవిత కాలం పడుతుందట" ఇది నా జీవితంలో ఓ మధుర స్మృతే. కాబట్టి దీనిని మరచిపోవడానికి నాకు ఈ జీవితకాలం అంతా సరిపోతుంది. నీ స్మృతులలో ఈ జీవితం గడిపేస్తాను. మరుజన్మ అనేదే ఉంటే మాత్రం ఖచ్చితంగా దగ్గరవుతా.

అంతవరకూ

నిను తలచుకుంటూ....

నను మరచిపోతూ....

'కాలం'తో రాజీపడ్తూ....

'కన్నీళ్ల'తో పోటీ పడ్తూ...

బ్రతుకు కొనసాగిస్తాను.

"ఒక మనిషి డైరీ చదివితే అతని 'జీవితం' తెలుస్తుందంటారు. నాడైరీ అంతా నీతోనే నిండిపోయింది నేస్తం".

నేను బాధ పడుతున్నానని ప్రకృతిలో జరిగే రోజువారి పనులేం ఆగిపోవు. కాకపోతే, కొన్ని విషయాలు కాలగర్భంలో కలిసిపోతాయి. కానీ, 'ఈ' విషయానికీ, నీ రూపానికీ మాత్రం నేను బ్రతికి ఉన్నంత కాలం నా హృదయపు అరలలో చోటుంటుంది నేస్తం.

*



## 'కూడా' వొద్దు

ఈ మధ్య నరుమారి బ్రదర్సు 'మేం చిన్న చిత్రాలకు కూడా రాస్తాం!' అని రాజకీయ నాయకులు బడుగు జీవితాలను ఉద్ధరిస్తాం! అన్నట్లు అంటున్నారు. చిన్న చిత్రాలకు 'కూడా' అంటూ పెద్ద మనసు చేసుకుని రాయవలసిన పనిలేదు. చిన్న రచయితలు చాలా మంది వున్నారు' అంటున్నారు పరిశ్రమలో చిన్న నిర్మాతలు బాధతో!

— సాయిరాం

